# డబ్ల్యూటీసీ టాప్‌లో భారత్



దుబాయ్: ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్(డబ్ల్యూటీసీ)లో భారత్ నంబర్‌వన్ ర్యాంక్‌లోకి దూసుకొచ్చింది. ఆదివారం ఐసీసీ విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో టీమ్‌ఇండియా 64.58 పాయింట్లతో అగ్రస్థానాన్ని అధిష్ఠించింది. ఇటీవల రాంచీలో ఇంగ్లండ్‌తో జరిగిన నాలుగో టెస్టులో ఐదు వికెట్ల తేడాతో భారత్ విజయం సాధించగా, మరోవైపు ఆస్ట్రేలియాతో తొలి టెస్టులో న్యూజిలాండ్ ఓడిపోవడంతో ర్యాంకింగ్ స్థానాలు తారుమారు అయ్యాయి. ఇప్పటి వరకు ఎనిమిది మ్యాచ్‌లాడిన టీమ్‌ఇండియా ఐదు విజయాలు, రెండు ఓటములు, ఒక డ్రాతో 64.58 సగటుతో టాప్‌లోకి వచ్చింది. సొంతగడ్డపై ఆసీస్‌తో జరిగిన తొలి టెస్టులో 172 పరుగుల తేడాతో ఓడిపోవడం 60.00 పాయింట్ల సగటుతో నంబర్‌వన్ ర్యాంక్ నుంచి రెండో స్థానానికి దిగజారింది. ఆస్ట్రేలియా (59.09), బంగ్లాదేశ్ (50.00), పాకిస్థాన్ (36.66), వెస్టిండీస్ (33.33) ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి. ఈ నెల 7 నుంచి ధర్మశాల వేదికగా మొదలయ్యే ఐదో టెస్టులో ఇంగ్లండ్‌పై భారత్ గెలిస్తే..ర్యాంకింగ్స్ మరింత మెరుగయ్యే అవకాశముంది.

# రాబిన్ మింజ్‌కు ప్రమాదం



రాంచీ: జార్ఖండ్ యువ వికెట్‌కీపర్, బ్యాటర్ రాబిన్ మింజ్ గాయపడ్డాడు. శనివారం జరిగిన ప్రమాదంలో రాబిన్ ప్రయాణిస్తున్న బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తి ఢీ కొట్టడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానిక ప్రైవేట్ దవాఖానలో ప్రస్తుతం రాబిన్ చికిత్స పొందుతున్నాడని అతని తండ్రి ఫ్రాన్సిస్ మింజ్ మీడియాకు వెల్లడించాడు. 'రాబిన్ కోలుకుంటున్నాడు. అతనికి పెద్ద గాయాలు ఏం కాలేదు. త్వరలోనే పూర్తిస్థాయిలో తేరుకుని బయటకు వస్తాడు' అని పేర్కొన్నాడు. ఇటీవల కర్ణాటకతో జరిగిన సీకే నాయుడు టోర్నీ క్వార్టర్స్‌లో రాబిన్ మింజ్ 137 పరుగులతో ఆకట్టుకున్నాడు. అయితే తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో కర్ణాటక సెమీస్‌కు అర్హత సాధించగా, జార్ఖండ్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఇదిలా ఉంటే రానున్న ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ తరపున రాబిన్ బరిలోకి దిగనున్నాడు. ఐపీఎల్ వేలంలో ఈ యువ క్రికెటర్‌ను గుజరాత్ 3.6 కోట్లకు తీసుకుంది. రాబిన్ తండ్రి ఫ్రాన్సిస్ మింజ్ రాంచీ ఎయిర్‌పోర్ట్‌లో ప్రస్తుతం సెక్యూరిటీ గార్డ్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. తన కొడుకు ఏ రోజైనా జాతీయ జట్టుకు ఆడాలని అభిలషిస్తున్నాడు.

# శార్దూల్ సూపర్ సెంచరీ

**ముంబై 353-9**



ముంబై: తమిళనాడుతో జరుగుతున్న రంజీ ట్రోఫీ సెమీఫైనల్లో ముంబై భారీ స్కోరు దిశగా సాగుతున్నది. లోయర్ ఆర్డర్ బ్యాటర్ శార్దూల్ ఠాకూర్(105 బంతుల్లో 109, 13ఫోర్లు, 4సిక్స్‌లు) సూపర్ సెంచరీతో కదం తొక్కాడు. కెరీర్‌లో తొలి సెంచరీ చేసిన శార్దూల్..ముంబై ఆధిక్యంలో నిలుపడంలో కీలకమయ్యాడు. ఆదివారం రెండో రోజు ముగిసే సరికి ముంబై తొలి ఇన్నింగ్స్‌లో 353–9 స్కోరు చేసింది. లోయార్ ఆర్డర్ బ్యాటర్లు తనుశ్ కొటియాన్(74 బ్యాటింగ్), తుషార్ దేశ్‌పాండే(17 బ్యాటింగ్) క్రీజులో కొనసాగుతున్నారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 45–2తో రెండో రోజు ఆట కొనసాగించిన ముంబైని సాయి కిషోర్(6–97), కుల్దీప్‌సేన్(2–65) దారుణంగా దెబ్బతీశారు. ముషీర్‌ఖాన్(55) అర్ధసెంచరీతో ఆదుకోగా, మోహిత్ అవస్తి(2), రహానే(19), శ్రేయాస్ అయ్యర్(3), ములానీ(0) ఘోరంగా విఫలమయ్యారు. దీంతో 106–7 స్కోరుతో ముంబై పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయింది. ఈ తరుణంలో శార్దూల్..ఎనిమిదో వికెట్‌కు హార్దిక్ తోమర్(35)తో కలిసి 105 పరుగులు, తనుష్‌తో తొమ్మిదో వికెట్‌కు 79 పరుగులు జతచేశాడు. ప్రస్తుతం ముంబై 207 పరుగుల కీలక ఆధిక్యంలో కొనసాగుతున్నది.

# ఢిల్లీ నం.1

## గుజరాత్‌పై ఘన విజయం

## జొనాసెన్ విజృంభణ

## మహిళల ప్రీమియర్ లీగ్

**మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్)లో ఢిల్లీ క్యాపిటల్స్ గెలుపు జోరు దిగ్విజయంగా కొనసాగుతున్నది. ప్రత్యర్థి ఎవరైనా గెలుపే లక్ష్యంగా దూసుకెళుతున్న ఢిల్లీ..గుజరాత్ జెయింట్స్‌ను మట్టికరిపించి టాప్‌లోకి దూసుకెళ్లింది. కెప్టెన్ మెగ్ ల్యానింగ్ అర్ధసెంచరీతో క్యాపిటల్స్ 163–8 స్కోరు చేసింది. మేఘనాసింగ్ నాలుగు వికెట్లతో రాణించింది. లక్ష్యఛేదనలో గుజరాత్ 138–8 స్కోరుకు పరిమితమైంది. జొనాసెన్, రాధా యాదవ్..గుజరాత్ పతనాన్ని శాసించారు. ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో ఓడిన గుజరాత్ పట్టికలో ఆఖరి స్థానంలో కొట్టుమిట్టాడుతున్నది.**



జొనాసెన్ (3–22)

బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్)లో ఢిల్లీ క్యాపిటల్స్ అదరగొడుతున్నది. మ్యాచ్ మ్యాచ్‌కు మరింత పరిణతి సాధిస్తూ వరుస విజయాలు ఖాతాలో వేసుకుంటున్నది. ఆదివారం చిన్నస్వామి స్టేడియం వేదికగా జరిగిన పోరులో ఢిల్లీ 25 పరుగుల తేడాతో గుజరాత్ జెయింట్స్‌పై అద్భుత విజయం సాధించింది. తొలుత ఢిల్లీ నిర్ణీత 20 ఓవర్లలో 163–8 స్కోరు చేసింది. కెప్టెన్ మెగ్ ల్యానింగ్(41 బంతుల్లో 55, 6ఫోర్లు, సిక్స్) అర్ధసెంచరీతో ఆకట్టుకుంది. మేఘనాసింగ్(4–37) నాలుగు వికెట్లతో ఆకట్టుకుంది. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన గుజరాత్..138–8 స్కోరుకు పరిమితమైంది. అష్లే గార్డ్‌నర్(40) ఫర్వాలేదనిపించగా, మిగతా బ్యాటర్లు ఘోరంగా విఫలమయ్యారు. జెస్ జొనాసెన్(3–22), రాధా యాదవ్(3–20) గుజరాత్‌ను పడగొట్టడంలో కీలకమయ్యారు. జొనాసెన్‌కు 'ప్లేయర్ ఆఫ్ మ్యాచ్' దక్కింది. ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో మూడు విజయాలు, ఒక ఓటమితో ఢిల్లీ(6) టాప్‌లో కొనసాగుతుండగా, గుజరాత్ నాలుగింట నాలుగు ఓటములతో ఆఖర్లో ఉంది.

**ల్యానింగ్ ఇన్నింగ్స్:**


ఢిల్లీ బ్యాటర్లు మెగ్ ల్యానింగ్, షెఫాలీ వర్మ ఆది నుంచే తమదైన దూకుడు ప్రదర్శించారు. కన్వర్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్లో షెఫాలీ ఫోర్, సిక్స్‌తో తన ఉద్దేశమేంటో చెప్పకనే చెప్పింది. అయితే మేఘనాసింగ్ వేసిన మూడో ఓవర్లో భారీ షాట్‌కు ప్రయత్నించిన షెఫాలీ..స్వేర్ లెగ్‌లో వోల్వార్డ్ చేతికి చిక్కింది. దీంతో షెఫాలీ స్వల్ప స్కోరుకే వెనుదిరిగింది. ఈ తరుణంలో ల్యానింగ్ ఇన్నింగ్స్ బాధ్యతను భుజాన వేసుకుంది. ల్యానింగ్, క్యాప్సె దూకుడైన బ్యాటింగ్‌తో ఢిల్లీ పవర్ ప్లే ముగిసే సరికి వికెట్ నష్టానికి 51 పరుగులు చేసింది. మేఘన మరోమారు దెబ్బతీసింది. ఈసారి కాప్సెను ఔట్ చేసి గుజరాత్ శిబిరంలో ఆనందం నింపింది. ఓవైపు సహచరులు నిష్క్రమిస్తున్నా..ఒత్తిడికి లోనుకాని ల్యానింగ్.. ఇన్నింగ్స్‌ను పునర్‌నిర్మించేందుకు ప్రయత్నించింది. వీలు కుదిరినప్పుడల్లా చెత్త బంతులను బౌండరీలకు తరలించిన ల్యానింగ్..మంచి బంతులను గౌరవిస్తూ ముందుకుసాగింది. మేఘనాసింగ్ 13వ ఓవర్లో వరుస బంతుల్లో బౌండరీలు బాది అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న ల్యానింగ్..హేమలతకు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది. ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లు పెద్దగా ఆకట్టుకోలేకపోవడంతో ఢిల్లీకి భారీ స్కోరు సాధ్యపడలేదు.

**గుజరాత్ పడుతూలేస్తూ:**

నిర్దేశిత లక్ష్యఛేదనలో గుజరాత్ బ్యాటింగ్ పడుతూలేస్తూ సాగింది. అరంగేట్రం బౌలర్ టిటాస్ సాధు ఇన్నింగ్స్ తొలి ఓవర్‌ను మెయిడిన్ చేయగా, రెండో ఓవర్లో పాండే బౌలింగ్‌లో లౌరా వోల్వార్డ్(0) సున్నా పరుగులకే ఔట్ అయ్యింది. వచ్చి రావడంతో లిచ్‌ఫీల్డ్ వరుస బౌండరీలతో విరుచుకుపడగా, బేత్ మూనీ కూడా దూకుడు ప్రదర్శించింది. అయితే స్పిన్నర్ జొనాసెన్..మూనీతో పాటు లిచ్‌ఫీల్డ్‌ను బౌల్ట్ చేసి మరోమారు గుజరాత్‌ను కష్టాల్లోకి నెట్టింది. ఇక్కణ్నుంచి ఏ దశలోనూ కోలుకోని గుజరాత్..జొనాసెన్, రాధా యాధవ్ ధాటికి వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయి మూల్యం చెల్లించుకుంది.

**సంక్షిప్త స్కోర్లు: ఢిల్లీ:** 20 ఓవర్లలో 163–8(ల్యానింగ్ 55, క్యాప్సె 27, మేఘనా సింగ్ 4–37, గార్డ్‌నర్ 2–37), **గుజరాత్:** 138–8(గార్డ్‌నర్ 40, లిచ్‌ఫీల్డ్ 15, రాధయాదవ్ 3–20, జొనాసెన్ 3–22)

# చాహల్‌ను తిప్పేసిన సంగీతా ఫోగట్



ముంబై: భారత యువ రెజ్లర్ సంగీతా ఫోగట్ తన భుజబలాన్ని ప్రదర్శించింది. తన జాతీయ, అంతర్జాతీయ కెరీర్‌లో ప్రత్యర్థులను మట్టికరిపించిన సంగీత.. ఈసారి టీమ్‌ఇండియా సీనియర్ స్పిన్నర్ యజువేంద్ర చాహల్ పనిపట్టింది. జలక్ దిక్ ఆజా అనే డ్యాన్స్ కార్యక్రమం ముగింపు సంబురాలకు హాజరైన చాహల్‌ను ఉన్నఫళంగా భుజాలపైకి ఎత్తుకుని గిరాగిరా తిప్పింది. దీంతో ఒక్కసారిగా అవాక్కు గురైన చాహల్ ఇక ఆపేయంటూ ఫోగట్‌ను వేడుకున్నాడు. ఇప్పుడు ఈ వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. యువతరం స్పిన్నర్లు జట్టులోకి దూసుకురావడంతో చాహల్‌ను టీమ్ మేనేజ్‌మెంట్ పక్కకు పెట్టిన సంగతి తెలిసిందే. ఇటీవల ప్రకటించిన బీసీసీఐ వార్షిక కాంట్రాక్టుల్లోనూ చాహల్ స్థానం లభించలేదు. దీనిపై పలువురు మాజీ క్రికెటర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

# 'యువకులే కీలకం' : గవాస్కర్



ముంబై: భారత మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ మరోమారు ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఇంగ్లండ్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌ను భారత్ గెలువడంలో యువ క్రికెటర్ల పాత్రను కొనియాడాడు. తాము లేకుండా మ్యాచ్‌లు గెలువలేమని విర్రవీగే పేరున్న క్రికెటర్లకు ఇది చెంప దెబ్బ లాంటిదని సన్నీ వ్యాఖ్యానించాడు. ఒక ప్రైవేట్ మీడియాతో మాట్లాడుతూ 'ఇంగ్లండ్‌పై టెస్టు సిరీస్ విజయంలో యువ క్రికెటర్లది కీలక భూమిక. స్టార్ క్రికెటర్ల గైర్హాజరీలో యువ ప్లేయర్లు అవకాశాలను అద్భుతంగా అందిపుచ్చుకున్నారు. ముఖ్యం గా ధృవ్ జురెల్, సర్ఫరాజ్ ఖాన్, ఆకాశ్‌దీప్‌సింగ్, రజత్ పాటిదార్ తమ విలువను చాటుకున్నారు. ఈ విషయంలో కెప్టెన్ రోహిత్‌శర్మ, కోచ్ రాహుల్ ద్రవిడ్ పాత్ర మరువలేనిది. వెన్నుతట్టి ప్రోత్సహించడం వల్లనే ఇది సాధ్యమైంది అని అన్నాడు.

## మధ్యప్రదేశ్ 252

నాగ్‌పూర్: విదర్భ, మధ్యప్రదేశ్ మధ్య రంజీ ట్రోఫీ ఆసక్తికరంగా సాగుతున్నది. హిమాన్షు మంత్రి(126) సెంచరీ చేసినా మధ్యప్రదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 252 పరుగులకే పరిమితమైంది. ఓవర్‌నైట్ స్కోరు 47–1తో ఆదివారం రెండో రోజు ఆట కొనసాగించిన మధ్యప్రదేశ్ భారీ స్కోరు సాధించలేకపోయింది. జైన్ (30), సాగర్ సోలంకీ (26), హర్ష్ గ్వాలీ (25) మినహా అందరూ ఘోరంగా విఫలమయ్యారు. ఉమేశ్ యాదవ్ (3–40), యష్ ఠాకూర్ (3–51), అక్షయ్ (2–68) ధాటికి మిగతా అందరూ సింగిల్ డిజిట్ స్కోర్లకే పరిమితమయ్యారు.

# ఆసీస్ అదుర్స్

## కివీస్‌పై తొలి టెస్టులో ఘన విజయం



వెల్లింగ్టన్: న్యూజిలాండ్‌తో రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో ఆస్ట్రేలియా అదరగొట్టింది. నాలుగు రోజుల్లో ముగిసిన తొలి టెస్టులో ఆసీస్ 172 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో సిరీస్‌లో 1–0తో ముందంజ వేసింది. ఆసీస్ నిర్దేశించిన 369 పరుగుల లక్ష్యఛేదన కోసం ఓవర్‌నైట్ స్కోరు 111–3 ఆట కొనసాగించిన కివీస్ రెండో ఇన్నింగ్స్‌లో 196 పరుగులకు ఆలౌటైంది. ఆస్ట్రేలియా వెటరన్ స్పిన్నర్ నాథన్ లియాన్(6–65) ధాటికి న్యూజిలాండ్ విలవిలలాడింది. రచీన్ రవీంద్ర(59), డారిల్ మిచెల్(38), స్కాట్ కుగెలిన్(26) తప్ప మిగతా బ్యాటర్లంతా ఘోరంగా నిరాశపరిచారు. లియాన్ తన సుదీర్ఘ అనుభవంతో కివీస్ బ్యాటర్లకు మూకుతాడు వేశాడు. పిచ్‌పై బంతి గింగిరాలు తిప్పుతూ కివీస్ పతనాన్ని శాసించాడు. లియాన్‌కు తోడు హాజిల్‌వుడ్ రెండు వికెట్లు తీశాడు. టెస్టుల్లో పది వికెట్ల ప్రదర్శన కనబర్చడం లియాన్‌కు ఇది ఐదోసారి. ఆసీస్ ఓపెనర్ కామెరూన్ గ్రీన్‌కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ దక్కింది. ఇరు జట్ల మధ్య ఈ నెల 8 నుంచి క్రైస్ట్‌చర్చ్‌లో జరుగనుంది.



# రాబడి

## ఆర్బీఐ బాండ్లు

# 100% సురక్షిత మదుపు

### ఎఫ్‌డీ, ఎన్ఎస్‌సీ కంటే ఎక్కువ వడ్డీ కూడా!

**రిస్క్** తీసుకోవడానికి ఇష్టపడని చాలా మంది వారి ఆదాయంలో ఆదా చేసుకున్న సొమ్మును భద్రంగా ఉంటుంది..కొంత వడ్డీ వస్తుందన్న ఆలోచనతో బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు, పోస్టాఫీసు పత్రాల్లో మదుపు చేస్తుంటారు. కానీ వీటికంటే అధిక వడ్డీనిచ్చే నూరు శాతం సురక్షితమైన సాధనాల్ని (కొన్ని బ్యాంక్‌ల డిపాజిట్లకు కొంత రిస్క్ ఉంటుంది) స్వయంగా రిజర్వ్‌బ్యాంకే జారీచేస్తుందన్న సంగతి చాలామందికి తెలియదు. అవే ఆర్బీఐ ఫ్లోటింగ్ రేట్ సేవింగ్స్ బాండ్స్. వీటికి భారత ప్రభుత్వం పూర్తి గ్యారంటీ ఉన్నది. అంటే ఇందులో మదుపుచేసే అసలు మొత్తం, వడ్డీ నూరు శాతం సురక్షితమన్న మాట. ఎస్బీఐ, జాతీయ బ్యాంక్‌ల శాఖల్లోనూ, మూడు ప్రైవేటు బ్యాంక్ శాఖల్లోనూ వీటికి దరఖాస్తు చేయవచ్చు. అలాగే ఆన్‌లైన్‌లో అయితే ఆర్బీఐ రిటైల్ డైరెక్ట్ పోర్టల్ ద్వారా తీసుకోవచ్చు.

**అర్హత**

మన దేశంలో నివసించేవారు, హిందూ అవిభాజ్య కుటుంబాలు (హెచ్‌యూఎఫ్‌లు) ఆర్బీఐ ఫ్లోటింగ్ రేట్ సేవింగ్స్ బాండ్లలో పెట్టుబడి చేయవచ్చు. మైనరు తరపున తండ్రి, తల్లి, చట్టబద్ధ గార్డియన్ మదుపు చేయవచ్చు. ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మందిని నామినేట్ చేసుకునే సౌలభ్యం ఉంది. ఈ బాండ్లలో ఇన్వెస్ట్ చేయడానికి ప్రవాస భారతీయులు అనర్హులు.

**వడ్డీ రేటు**

పోస్టాఫీసులో లభించే నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఎన్ఎస్‌సీ)పై ఇచ్చే రేటుకు 35 బేసిస్ పాయింట్లు అదనంగా (0.35 శాతం)ఈ బాండ్లపై వడ్డీ రేటును నిర్ణయిస్తారు. ప్రతీ ఆరు నెలలకూ అప్పటి ఎన్ఎస్‌సీ రేటుకు అనుగుణంగా ఈ బాండ్‌పై సైతం రేటు మారుతుంది. ప్రస్తుతం ఎన్ఎస్‌సీకి అమల్లో ఉన్న వడ్డీ రేటు 7.7 శాతం. దానికి తగ్గట్టు 0.35 శాతం పెంపుదలతో ఆర్బీఐ ఫ్లోటింగ్ రేట్ సేవింగ్స్ బాండ్స్‌పై 8.05 శాతం వడ్డీ రేటుతో లభిస్తుంది. అదే ప్రభుత్వ రంగ ఎస్బీఐ ఆఫర్ చేసే 5 నుంచి 10 ఏండ్ల డిపాజిట్‌పై 7.5 శాతం వడ్డీ రేటు ఉన్నది.

**కాలపరిమితి**

ఆర్బీఐ ఫ్లోటింగ్ రేట్ సేవింగ్స్ బాండ్ కాలపరిమితి జారీ అయిన తేదీ నుంచి ఏడేండ్లు ఉంటుంది. 60 ఏండ్లు దాటినవారు ఏడేండ్ల కంటే ముందుగానే బాండ్‌ను తిరిగి ఇచ్చి తాము ఆదా చేసిన సొమ్ము తీసుకోవచ్చు. 60–70 ఏండ్లవారు ఆరేండ్లు, 70–80 ఏండ్ల వారు ఐదేండ్లు, 80పైబడినవారు నాలుగేండ్ల తర్వాత ముందస్తుగా రిడీమ్ చేసుకోవచ్చు.

**పెట్టుబడి పరిమితి**

ఆర్బీఐ ఫ్లోటింగ్ రేట్ సేవింగ్స్ బాండ్లను కనీసం రూ.1000 ముఖ విలువతో జారీచేస్తారు. వీటిలో గరిష్ఠ పెట్టుబడికి ఎటువంటి పరిమితీ లేదు. ఎన్ని బాండ్లనైనా తీసుకోవచ్చు.

**పన్ను ప్రయోజనాలు**

ఈ బాండ్ల మీద వచ్చే వడ్డీ ఆదాయంపై పన్ను ఉంటుంది. వడ్డీ చెల్లింపు సమయంలో ప్రస్తుత ఐటీ నిబంధనల ప్రకారం 10 శాతం టీడీఎస్‌ను మినహాయిస్తారు. ఒక సంవత్సరంలో రూ.40,000 లోపు వడ్డీ ఆదాయంపై టీడీఎస్ ఉండదు. అలాగే సీనియర్ సిటిజన్లకు రూ.50,000 లోపు వడ్డీ ఆదాయంపై టీడీఎస్ మినహాయించరు. ఈ బాండ్లకు సంపద పన్ను మాత్రం ఉండదు.






# ఆదాయ పన్ను ఆదా చేద్దాం ఇలా..

*ఆర్థిక సంవత్సరం ముగుస్తోందంటే చాలు.. చాలామంది పన్ను ఆదాసహా ట్యాక్స్ ప్లానింగ్‌పై దృష్టి పెడుతారు.*

> **కొత్త, పాత పన్నుల విధానాలు వచ్చినప్పటికీ సెక్షన్ 80సీ విషయంలో ఎప్పటికీ కొంత సందిగ్ధతతోపాటు ఆప్షన్స్ విషయంలో క్లారిటీ కోసం ఎదురుచూస్తూనే ఉంటారు.**

*ప్రజల్లో పొదుపు అలవాట్లను పెంచడానికి ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోగల పన్ను రాయితీ విధానమే సెక్షన్ 80సీ. దీని కింద గల పెట్టుబడి సాధనాల్లో ఇన్వెస్ట్ చేయడం వల్ల ఏటా గరిష్ఠంగా రూ.1.5 లక్షలదాకా పన్ను చెల్లింపులను ఆదా చేసుకోవచ్చు. కానీ పాత పన్నుల విధానాన్ని ఎంపిక చేసుకున్నవాళ్లకే ఈ ప్రయోజనం అందుతుంది.*

ట్యాక్స్ పేయర్స్‌కు పన్ను ఆదా కోసం ఉన్న వివిధ సాధనాలను పరిశీలిస్తే..

### ఫిక్స్‌డ్ డిపాజిట్లు

ఇదో సులువైన పన్ను తగ్గింపు సాధనం. కానీ లాకిన్ పీరియడ్ ఉంటుంది. గరిష్ఠంగా రూ.1.5 లక్షలదాకా పన్ను ప్రయోజనం పొందవచ్చు. ఇక బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీ) సురక్షితమన్న విషయం తెలిసిందే.

### సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్ స్కీం

ఇది సీనియర్ సిటిజన్లకు వర్తిస్తున్న పన్ను విధానం. 60 ఏండ్లకు పైబడినవాళ్లకు మాత్రమే ఇందులో ఇన్వెస్ట్ చేసే వీలున్నది. ఐదేండ్ల లాకిన్ పీరియడ్ ఉంటుంది. అయితే మరో మూడేండ్ల గడువును కూడా పొడిగించుకునే వెసులుబాటు ఉంది. సెక్షన్ 80సీ కింద పన్ను ప్రయోజనాలు గరిష్ఠంగా రూ.1.5 లక్షల వరకూ ఉంటాయి. ఏడాదికి రూ.50వేలకుపైగా వడ్డీ వస్తే, అది ట్యాక్సబుల్ ఇన్‌కమ్ అవుతుందని గమనించండి.

### పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్)

పీపీఎఫ్ అనేది ఓ స్మాల్ సేవింగ్స్ పెట్టుబడి విధానం. కేంద్ర ప్రభుత్వ మద్దతు ఉండటంతో ఇది చాలా సేఫ్. ఇతర పన్ను సాధనాలతో పోల్చితే దీనికి లాకిన్ పీరియడ్ చాలా ఎక్కువ. అయితే ఏడో సంవత్సరం తర్వాత కొద్ది మొత్తాన్ని మన కార్పస్ నుంచి విత్‌డ్రా చేసుకునే అవకాశం ఉంటుంది. మనం పొందే వడ్డీపైనా ఎలాంటి పన్నూ ఉండదు.

### నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఎన్ఎస్‌సీ)

ఇదొక కేంద్ర ప్రభుత్వ స్పాన్సర్డ్ సేవింగ్స్ ప్రోగ్రాం. ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ ఇన్వెస్ట్‌మెంట్ ఛాయిస్. అయితే ప్రభుత్వం దీనికి ఒక నిర్దిష్టమైన వడ్డీరేటును నిర్ణయిస్తుంది. ఎన్ఎస్‌సీ కింద ఇన్వెస్ట్ చేసినప్పుడు ట్యాక్స్ డిడక్షన్ లభిస్తుంది. దీనికి కూడా ఐదేండ్ల లాకిన్ పీరియడ్ ఉంటుంది. అయితే ఈ పథకం కింద లభించే వడ్డీపై మాత్రం ట్యాక్స్ ఉంటుంది. మన శ్లాబ్స్‌కు తగ్గట్టు పన్ను పడుతుందని గమనించాలి.

### సుకన్య సమృద్ధి స్కీం

సుకన్య సమృద్ధి స్కీం ఓ అత్యద్భుత పెట్టుబడి సాధనం. ఆడపిల్లలున్న తల్లిదండ్రులు దీన్ని ఉపయోగించుకోవచ్చు. సుదీర్ఘ లాకిన్ పీరియడ్ ఉన్నప్పటికీ ఆడపిల్లల ఉన్నత చదువు, పెండ్లిళ్లకు ఉపయుక్తంగా ఉంటుంది. 21 ఏండ్లు వచ్చినప్పుడు పెండ్లికి నిధులను వాడుకోవచ్చు. 18 ఏండ్లు లేదా 10వ తరగతి పూర్తయిన తర్వాత ఉన్నత చదువులకు పాక్షికంగా ఈ నిధులను తీసుకోవచ్చు. ఇందులో ఇన్వెస్ట్ చేసే మొత్తానికి సెక్షన్ 80సీ కింద పన్ను ప్రయోజనం పొందవచ్చు. ఇద్దరు ఆడపిల్లలు ఉన్నప్పటికీ గరిష్ఠంగా రూ.1.5 లక్షల వరకే ట్యాక్స్ బెనిఫిట్స్ అందుకోవచ్చు. మెచ్యూరిటీ సమయంలో వచ్చే ప్రయోజనంపై ఎలాంటి ట్యాక్స్ కట్టాల్సిన అవసరం లేకపోవడం మరో అదనపు బెనిఫిట్.

### రకరకాల రుణాలు

గృహ, విద్యా రుణాలు తీసుకోవడం వల్ల కూడా కొన్ని పన్ను రాయితీలను పొందవచ్చు. ఐటీ చట్టంలోని సెక్షన్ 24బీ కింద గృహ రుణంపై చెల్లించే వడ్డీలో రూ.2 లక్షల వరకూ మినహాయింపు పొందవచ్చు. అలాగే సెక్షన్ 80సీ కింద అసలు మొత్తంపై కూడా గరిష్ఠంగా రూ.1.5 లక్షల వరకూ ఆదా చేసుకోవచ్చు. సెక్షన్ 80ఈ ప్రకారం ఉన్నత విద్య కోసం తీసుకునే రుణాలపై కూడా ప్రయోజనాలు అందుకోవచ్చు. పాత పన్ను విధానాన్ని ఎంచుకున్న వాళ్లకు మాత్రమే ఇది వర్తిస్తుంది.

### ఈఎల్ఎస్ఎస్


ఈక్విటీ మార్కెట్లో ఇన్వెస్ట్ చేస్తూ.. పన్ను లాభాలను పొందాలని అనుకునే వాళ్లకు ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీం (ఈఎల్ఎస్ఎస్) ఉత్తమ సాధనం. మ్యూచువల్ ఫండ్లలో ఇన్వెస్ట్ చేసే ఈ స్కీం కింద కూడా గరిష్ఠంగా రూ.1.5 లక్షలదాకా పన్ను ఆదా చేసుకోవచ్చు. దీనికి కూడా మూడేండ్ల లాకిన్ పీరియడ్ ఉంటుంది. సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) పద్ధతిలో దీర్ఘకాలంలో ఇన్వెస్ట్ చేయడం వల్ల మంచి రిటర్న్స్‌ను దీన్నుంచి ఆశించవచ్చు.



### చివరగా..

సాధారణంగా ఏడాది ప్రారంభం నుంచే మనం ట్యాక్స్ ప్లానింగ్‌పై దృష్టి పెట్టాల్సి ఉంటుంది. ఆఖర్లో సిద్ధమైతే అనుకున్న లక్ష్యాలను సాధించడం కష్టమే. అలాగే ఐటీ చట్టంలోని సెక్షన్ 80సీతోపాటు 80సీసీసీ, 80సీసీడీ, 80ఈ, 80ఈఈలతోనూ పన్ను ప్రయోజనాలుంటాయి. 80డీ కింద ఆరోగ్య బీమాకు చెల్లించే ప్రీమియంలపై పన్ను క్లెయిం చేసుకోవచ్చు. రూ.5వేలకు లోబడి కుటుంబ సభ్యులు, తల్లిదండ్రుల హెల్త్ చెకప్‌లకు చెల్లించే సొమ్ముపైనా క్లెయిం చేసుకోవచ్చు. ఇక 80జీ కింద వచ్చే నెల మార్చి ఆఖర్లోగా అర్హత ఉన్న చారిటీ సంస్థలకిచ్చే విరాళాలనూ పన్ను ఆదా కోసం క్లెయిం చేసుకోవచ్చు. ఇవన్నీ కూడా పాత పన్ను విధానాన్ని ఎంచుకుంటేనే ఉంటాయి.

-నాగేంద్రసాయి కుందవరం



# ట్రేడింగ్ శ్రేణి విస్తృతం

**మార్కెట్ పల్స్**

**యూఎస్,** జపాన్, జర్మనీ తదితర ప్రధాన మార్కెట్లు ఏ రోజుకారోజు కొత్త రికార్డుల్ని నెలకొల్పుతున్న నేపథ్యంలో భారత్ సూచీలు సైతం ఆల్‌టైమ్ హైకి చేరాయి. శనివారంతో సహా ఆరు రోజుల ట్రేడింగ్ వారంలో నిఫ్టీ 22,410 పాయింట్ల గరిష్ఠస్థాయిని తాకిన తర్వాత చివరకు వారం మొత్తమీద 165 పాయింట్ల లాభంతో 22,378 పాయింట్ల వద్ద నిలిచింది. కొత్త గరిష్ఠాలకు చేరినప్పటికీ మార్కెట్ పరుగు తీసేంతటి పటిష్ఠత వీక్లీ చార్టుల్లో కన్పించడం లేదని, ప్రస్తుత లేదా అధికస్థాయిలో కన్సాలిడేట్ కావచ్చని ఈక్విటీరీసెర్చ్.ఆసియా వ్యవస్థాపకుడు మిలన్ వైష్ణవ్ విశ్లేషించారు. కాకపోతే ఈ వారం ట్రేడింగ్ శ్రేణి మరికొంత విస్తృతం అవుతుందని, వోలటాలిటీ పెరుగుతుందన్నారు.

**తొలి అవరోధం 22,400**

ఈ వారం నిఫ్టీకి సమీపంలోని 22,400 పాయింట్ల స్థాయి తొలుత అవరోధం కల్గించవచ్చని, ఈ స్థాయిని బలంగా దాటితే 22,650 పాయింట్ల వరకూ పెరగవచ్చని వైష్ణవ్ అంచనా వేశారు. దిగువస్థాయిలో 22,050, 21,850 స్థాయిలు మద్దతుగా నిలుస్తాయన్నారు. 22,200, 22,300 స్ట్రైక్స్ నుంచి కాల్ రైటర్లు వారి పొజిషన్లను అన్‌వైండ్ చేయడం ప్రారంభించినందున, ఈ వారం నిఫ్టీ 22,500 పాయింట్లకు చేరవచ్చని యాక్సిస్ సెక్యూరిటీస్ రీసెర్చ్ హెడ్ రాజేశ్ పాల్వియా తెలిపారు. 22,200 పాయింట్ల స్థాయి స్వల్పకాలికంగా మద్దతు ఇస్తుందన్నారు. ఈ వారం నిఫ్టీ 22,500 పాయింట్లను, అందకంటే అధికస్థాయిల్ని అందుకోవచ్చని అంచనా వేస్తున్నట్టు ఎలిమెంట్స్ ప్లాట్‌ఫామ్స్ చైర్మన్ అజయ్ బగ్గా తెలిపారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.